# దివ్య దీప్తుల దివాళి

## నేడే కోటి కాంతుల దీపావళి

### వేడుకలకు సిద్ధమైన ఉమ్మడి జిల్లా ప్రజలు

### పటాకులు కాలుస్తూ సందడి చేయనున్న చిన్నారులు

దీపం అజ్ఞానాంధకారం నుంచి మానవాళిని జ్ఞాన మార్గంలోకి నడిపే సాధనం. చెడుపై మంచి సాధించే విజయం. గోపికలను నరకాసురుడి నుంచి శ్రీకృష్ణుడు కాపాడిన రోజు. లంకాధిపతి చెర నుంచి శ్రీరాముడు సీతను విడిపించిన రోజు. వీటికి చిహ్నమే దీపావళి. ఆశ్వియుజ అమావాస్య సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లా ప్రజలు ఘనంగా వేడుకలు జరుపుకోనున్నారు. చిన్నా పెద్దా అన్నివర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. గగన వీధిలో కాంతి పుంజాలు నింపనున్నారు. పిల్లలు అందంగా ముస్తాబై ఇంటింటా సందడి చేయనున్నారు. పటాకులు కాలుస్తూ సందడి చేయనున్నారు. సోదరులు ఆడపడుచులను ఆశీర్వదించి కట్నకానుకలు అందివ్వనున్నారు. భక్తులు లక్ష్మీదేవిని పూజించనున్నారు. దీపాలు వెలిగించి ఇష్టదైవాన్ని కొలవనున్నారు. పితృదేవతలకు తర్పణాలు ఇవ్వనున్నారు. పిండవంటలు పంచుకోనున్నారు.

### పటాకుల కొనుగోళ్ల జోరు..

ఉభయ జిల్లాల్లో శనివారం నుంచే దీపావళి పండుగ సందడి మొదలైంది. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలోని మైదానంలో లైసెన్స్ పటాకుల దుకాణాలు వెలిశాయి. పటాకులు కొనుగోలు చేస్తూ నగరవాసులు కనిపించారు. అలాగే కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ దుకాణాల్లో పట్టణవాసులు పటాకులు కొంటూ సందడి చేశారు.

ఖమ్మం నగరంలోని డిగ్రీ కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాలు



ముసిరే చీకట్లను తొలగిస్తూ.. అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపిస్తూ.. కుంచితత్వం నుంచి విశాల దృక్పథం వైపు పయనింపజేస్తూ.. మానవాళికి విజయాలు ప్రసాదిస్తూ.. ప్రతి కుటుంబంలో సంతోషాలను నింపుతూ.. ఆనందోత్సాహాలను కలిగిస్తూ కోటి కాంతుల దీపావళి వచ్చేసింది.. ఇంటింటికీ పండుగ తెచ్చేసింది.. ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దివాళి వేడుకలు జరుగనున్నాయి.. చిన్నారులు పటాకులు కాలుస్తూ సందడి చేయనున్నారు.. మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

*– ఖమ్మం/కొత్తగూడెం టౌన్, నవంబర్ 11*

### మంత్రి, ఎమ్మెల్సీ, ఎంపీల శుభాకాంక్షలు







ఖమ్మం, నవంబర్ 11: దీపావళి ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఐష్టైశ్వర్యాలతో వెలసిల్లాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు ఎమ్మెల్యేలు ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



ఖమ్మం నగరంలో పటాకుల కొనుగోళ్లు



కొత్తగూడెంలో దీప ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు







కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో పటాకులు కొనుగోలు చేస్తున్న పట్టణవాసులు

# అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి వలసలు

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు

బూర్గంపహాడ్, నవంబర్ 11: కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసే ఎక్కువమంది ఇతరపార్టీలకు చెందని నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. లక్ష్మీపురంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు శనివారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. పార్టీలో చేరినవారంతా పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీశ్, ఇరవెండి మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ పొడియం ముత్యాలమ్మ, వైస్ ఎంపీపీ బసంతిదేవి, నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి, ఎల్లంకి లలిత, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, పోతిరెడ్డి గోవిందరెడ్డి, పాలెం దివాకర్‌రెడ్డి, పొడియం నరేందర్, కొనకంచి శ్రీను, గుల్‌మహ్మద్, బెజ్జంకి కనకాచారి, బాలి శ్రీహరి, కాకాని రాంబాబు, కోటమర్తి వెంకటేశ్వరరావు, బిట్రా సాయిబాబా, చుక్కపల్లి బాలాజీ, గోనెల నాని, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, సర్పంచ్‌లు కొర్సా లక్ష్మి, భూక్యా శ్రావణి పాల్గొన్నారు.

#### లక్ష్మీపురం నుంచి పలువురు..

పినపాక, నవంబర్ 11: లక్ష్మీపురంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అనుచరులు వారా శంకర్, పటేల్ మనోహర్, వీరముష్టి ప్రభాకర్, కొండేరు నాగేశ్వరరావు శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు సమక్షంలో పార్టీలోచేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చూసి రేగాకు మద్దతు ఇస్తున్నామన్నారు.

#### న్యూ డెమోక్రసీ (ప్రజాపంథా) నుంచి 30 కుటుంబాలు..

గుండాల, నవంబర్ 11: మండల పరిధిలోని వెన్నెలబైలులో న్యూ డెమోక్రసీ (ప్రజాపంథా)కు చెందిన 30 కుటుంబాలు నాయకుడు వట్టం రవి ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ మండల కార్యదర్శి రవీందర్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరాయి. పార్టీలో చేరిన వారికి వారు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కొర్స లాలయ్య, సుధాకర్, జనగం లక్ష్యయ్య, కృష్ణ, పర్శిక నర్సయ్య, సారయ్య, వెంకటేశ్వర్లు, పర్శిక కృష్ణ పాల్గొన్నారు.



బూర్గంపహాడ్: పార్టీలో చేరిన వారితో రేగా కాంతారావు



గుండాల: పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

## గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ దాడులు

### నాటు సారాయి, లిక్కర్ స్వాధీనం.. తొమ్మిది మంది అరెస్టు

సత్తుపల్లి, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాల్లో రెండు రోజుల నుంచి ఎక్సైజ్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ సీఐ రాజశేఖర్ శనివారం దాడులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ సిబ్బంది రెండు రోజుల్లో పలుచోట్ల దాడులు నిర్వహించి 37.5 లీటర్ల నాటు సారాయి, 53.46 లీటర్ల లిక్కర్, 11.70 లీటర్ల బీర్, 110 లీటర్ల కల్లు, 400 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. కల్లూరు మండలంలో నాటు సారాయి రవాణా చేస్తున్న రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 11: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల పరిధిలో పోలింగ్ కేంద్రాలను శనివారం ఎన్నికల కమిషన్ స్టేట్ జనరల్ అబ్జర్వర్ గణేశ్ పరిశీలించారు. కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలను సంబంధిత అధికారులను ఆరా తీశారు. అనంతరం బోర్డర్‌లోని ఆర్టీఏ చెక్‌పోస్ట్, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. పర్యటనలో అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు, నోడల్ అధికారి రామన్ ఉన్నారు.

## 15 కిలోల గంజాయి పట్టివేత

వైరా టౌన్, నవంబర్ 11: వైరా బస్టాండ్‌లో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి ఇద్దరు తరలిస్తున్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ సిబ్బంది శనివారం వైరా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన బ్యాగులను సోదా చేసి 15 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. నిందితులను అఖిల్, శివగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.50 లక్షలు విలువ ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.